## ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

**సనత్‌నగర్:** టమాటా రూ. 11, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 35, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 28, క్యాప్సికం 45, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 13, క్యారెట్ 32, దొండ 45, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 45, గోకర కాయ 28, కీర 28, దోసకాయ 18, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 28, చామగడ్డ 40, మొరంగడ్డ 28, కందగడ్డ 65, సొరకాయ 11, పొట్లకాయ 15, అరటికాయ 10, మునగకాయ 10–12, ముల్లంగి 4–5. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

## నేడు ఓయూలో ఉద్యమకారుల సమావేశం

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూలో ఈనెల 20న (నేడు) తెలంగాణ ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశం జరగనున్నది. తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల వేదిక (టీవీయూవీ) ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీలో ఉదయం 11 జరిగే సమావేశానికి ఉద్యమకారులు హాజరుకాలని కంచర్ల బద్రి ఆదివారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్, ప్రొ.కాశీం, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డా.పిడమర్తి రవి, విద్యా కమిషన్ సభ్యులు డా.చారకొండ వెంకటేశ్, బీసీ కమిషన్ సభ్యులు డా. బాలలక్ష్మి తదితరులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

## 'రైతులపై కేటీఆర్‌ది కపట ప్రేమ'

**సనత్‌నగర్:** రైతుల ఆత్మహత్యలపై కేటీఆర్ చేసిన ట్వీట్ కపట ప్రేమ అని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమా అన్నారు. ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకున్న ఏకపక్ష నిర్ణయాలే రైతుల కష్టాలకు ప్రధాన కారణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే రైతుల రుణమాఫీ కోసం రూ.21,000 కోట్లు ఖర్చు చేసిందన్నారు. అలాగే వారి సంక్షేమానికి రూ.54,000 కోట్లు కేటాయించిందన్నారు. అదనంగా ఎకరానికి రూ.12,000, భూమి లేని రైతులు, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12,000, రూ.2 లక్షల వరకు రుణమాఫీ, మెరుగైన బియ్యానికి ఎంఎస్‌పీతో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ వంటి సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుందన్నారు. రైతుల జీవితాలను మెరుగుపర్చడం, నిస్వార్థ సేవ చేయడం మాత్రమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

## చురుగ్గా రేషన్ కార్డుల సర్వే



సర్వేను పరిశీలిస్తున్న డీసీ సుభాష్‌రావు, ఏఎంసీ సంధ్యారాణి

**చిలకలగూడ:** సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో రేషన్ కార్డుల సర్వే చురుగ్గా కొనసాగుతోంది. సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లలోని పలు ప్రాంతాల్లో సర్వేను డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావు, ఏఎంసీ సంధ్యారాణి ఆదివారం పరిశీలించారు. సర్కిల్ పరిధిలో 5,900 దరఖాస్తులు రాగా, 3400 అర్జీలను సర్వేకు ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. సర్కిల్ పరిధిలో 40 మంది సిబ్బందితో 5 బృందాలతో పారదర్శకంగా సర్వే కొనసాగుతున్నదని దళారులను నమ్మి మోసపోవద్దని డీసీ సూచించారు. ఎంపిక చేసిన దరఖాస్తుదారుల ఇంటింటికీ తిరిగి ప్రభుత్వోద్యోగం, సొంత ఇళ్లు, వాహనాలు, వార్షిక ఆదాయం తదితర అంశాలతో కూడిన వివరాలను సేకరించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి జాబితాను ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు.

## ఎమ్మెల్యే పరామర్శ



సుదర్శన్‌రావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తలసాని

**సనత్‌నగర్:** తన వ్యక్తిగత సహాయకుడు వెల్లంకి హరీశ్ తండ్రి సుదర్శన్‌రావు ఇటీవల చికిత్స పొంది ఇంటికి చేరుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ బీకేగూడలోని వారి నివాసానికి ఆదివారం వెళ్లి ఆయనను పరామర్శించారు. సనత్‌నగర్, రాంగోపాల్‌పేట బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నాయకులు సంతోష్, అశోక్‌యాదవ్, శ్రీహరి, ప్రవీణ్‌రెడ్డి, కూతురు నర్సింహ, రాజేశ్‌ముదిరాజ్, శేఖర్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ విలేకరి మృతి

**అమీర్‌పేట:** చికిత్స పొందుతూ ఓ విలేకరి ఆదివారం మృతి చెందాడు. ఎస్‌ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని బాపట్లకు చెందిన రమేశ్ (57) యూసుఫ్‌గూడ విలేకరిగా పని చేసేవాడు. సంక్రాంతి పండుగ రోజు అల్లుడితో కలిసి వేర్వేరు బైక్‌లపై ఎస్‌ఆర్‌నగర్‌కు వెళ్లారు. ఉమేశ్‌చంద్ర విగ్రహం నుంచి పాత పోలీస్ స్టేషన్ వైపు వెళ్తుండగా వెనకనుంచి ట్రిపుల్ రైడింగ్‌తో వేగంగా వచ్చిన మరో ద్విచక్ర వాహనదారుడు రమేశ్ బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. ఈ క్రమంలో అతడు కిందపడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించి అమీర్‌పేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

# బుద్ధిమాంద్యుల జీవితాల్లో వెలుగు!

**స్ఫూర్తి మానసిక వికలాంగుల పాఠశాల చొరవ**



ఫిజియోథెరపి చేస్తున్న దృశ్యం





వివిధ అంశాల్లో శిక్షణ అందజేస్తున్న దృశ్యం

- కంటోన్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహణ
- 52 మందికి శిక్షణా తరగతులు

**రసూల్‌పురా:** మానసిక బుద్ధిమాంద్యం, శారీరక వికలాంగత్వం గల పిల్లల జీవితాల్లో స్ఫూర్తి మానసిక వికలాంగుల పాఠశాల వెలుగులు నింపుతోంది. వారికి సమాజంలో స్థానం కల్పించేందుకు విశేషంగా కృషి చేస్తోంది. కంటోన్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఈ పాఠశాల కొనసాగుతున్నదది. మానసిక బుద్ధిమాంద్యత, శారీరక వికలాంగత్వం గల పిల్లలపై ఆశలు వదులుకున్న తల్లిదండ్రులకు ఒప్పించి నిరంతరం సుశిక్షితులైన అధ్యాపకుల ఆధ్వర్యంలో ఉచితంగా విద్యాబోధన అందిస్తూ వారిలో స్ఫూర్తి నింపుతోంది.

**వివిధ అంశాల్లో ప్రత్యేక శిక్షణ..**

కంటోన్మెంట్ బోర్డు సీఈవో పర్యవేక్షణలో రసూల్‌పురా గన్‌బజార్‌లో 15 ఏళ్లుగా మానసిక వికలాంగుల పాఠశాల కొనసాగుతోంది. మొదట్లో 10 మంది విద్యార్థులతో ప్రారంభం కాగా ప్రస్తుతం 3– 18 ఏళ్ల వయస్సున్న 52 మంది స్టూడెంట్స్ శిక్షణ పొందుతున్నారు. విద్యార్థుల వయస్సును బట్టి ఈసీఎస్ఈ, ప్రీ ప్రైమరీ, ప్రైమరీ, సెకండరీ, ఒకేషనల్, విభాగాల్లో బోధిస్తున్నారు వస్తువులను గుర్తించేలా శిక్షణ, ఉపయోగాలు, అర్థమయ్యేరీతిలో విద్యాబోధన, వార్మప్ ఎక్సర్‌సైజ్, ఫిజియోథెరపి అందజేస్తున్నారు. ప్రత్యేకంగా తయారు చేసిన పరికరాలతో తేదీలు, నెలలు, సంవత్సరాలు గణితం, పెయింటింగ్, కోలాజ్ ఆర్ట్స్, కళాత్మక వస్తువులతో పాటు ఫినాయిల్ తయారీ, ఎనవలప్స్ మేకింగ్, పేపర్ బ్యాగ్స్‌లో శిక్షణ అందజేస్తున్నారు.

**యేటా సర్వేతో గుర్తింపు..**

యేటా పాఠశాల ప్రారంభానికి ముందు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలితో పాటు ఉపాధ్యాయులు రసూల్‌పురా, బాలంరాయి, అన్నానగర్, అర్జున్‌నగర్, బేగంపేట, ప్రకాశ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ సర్వే చేస్తారు. బుద్ధిమాంద్యులు, శారీరక వికలాంగత్వం గల పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులను ఒప్పించి పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేస్తున్నారు. అనంతరం పిల్లల వివరాలను నివేదిక రూపంలో సీఈవోకు అందజేస్తారు. కాగా పాఠశాలకు దూరంగా బస్తీలు ఉండడం, రవాణా సౌకర్యం లేకపోవడంతో తల్లిదండ్రులు వారి పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు ఆసక్తి చూపడం లేదు. రవాణా సౌకర్యం ఉంటే పిల్లలను పాఠశాలలో చేర్పిస్తామని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా బోర్డు అధికారులు స్పందించి రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

## నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

**కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్**



ఎమ్మెల్యే శ్రీగణేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఈస్ట్ మారేడుపల్లి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

**కంటోన్మెంట్:** కంటోన్మెంట్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. మోండా డివిజన్ ఈస్ట్‌మారేడుపల్లి, కంటోన్మెంట్ 6 వార్డు రెడ్డి కాంపౌండ్‌లలో ఆదివారం పర్యటించారు. ఈస్ట్‌మారేడుపల్లిలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నదని, అలాగే ఫుట్‌పాత్‌లు సైతం దెబ్బతినడంతో పాదచారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారని స్థానిక కాంగ్రెస్ నేత సంతోష్ యాదవ్‌తో కలిసి ఈస్ట్‌మారేడుపల్లి వెల్ఫేర్ అసోసియేషన్ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. దీంతో ఆయన స్పందిస్తూ క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకునేందుకే పర్యటనలు చేపడుతున్నానన్నారు. దీర్ఘకాలిక సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు.

**ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించండి..**

రక్షణ శాఖకు చెందిన బీ–3 స్థలంలో వెలిసిన రెడ్డి కాంపౌండ్ బస్తీవాసులు ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు. అలాగే నీటి సమస్య తీవ్రంగా ఉందని, స్ట్రీట్ లైట్స్ కూడా లేవని ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. సదుపాయాల క ల్పనకు కృషి చేస్తానని, అలాగే ఇందిరమ్మ ఇళ్ల కో సం ప్రభుత్వానికి సిఫారసు చేస్తానన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న రెడ్డి కాంపౌండ్‌వాసులు

## ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడికి ఓయూ డాక్టరేట్



**ఉస్మానియా యూనివర్సిటీ:** ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ మాదిగ ఓయూలో పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించారు. హన్మకొండ జిల్లా దామెర మండలం పులుకుర్తికి చెందిన గోవిందు నరేశ్‌మాదిగ ఓయూ ప్రొ.ఏకే వాసుదేవ చారి పర్యవేక్షణలో 'ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఇన్ తెలంగాణ ఏ స్పెషల్ ఫోకస్ ఆన్ ఎస్సీ ఉమెన్' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ డిగ్రీ లభించింది. గోవిందు నరేశ్ ఆదివారం ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణమాదిగను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు.

## స్క్రాప్ దుకాణంలో అగ్నిప్రమాదం



**బన్సీలాల్‌పేట్:** ఐడీహెచ్ కాలనీలోని ఓ స్క్రాప్ దుకాణంలో ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికంగా ఉండే జాన్ ఐడీహెచ్ కాలనీలో స్క్రాప్ దుకాణం నడిపిస్తున్నాడు. శనివారం రాత్రి షాపు మూసేసి ఇంటికి వెళ్లాడు. అయితే రాత్రి సమయంలో షాపులో నుంచి పొగలు వస్తుండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. దేవుడి దగ్గర పెట్టిన దీపం వలన మంటలు అంటుకొని ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 50వేల వరకు నష్టం జరిగినట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బాధితులకు నష్టపరిహారం అందించాలి

**రసూల్‌పురా:** ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా ఇళ్లు కోల్పోతున్న బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జే రామకృష్ణ అన్నారు. ఒకటో వార్డు చిన్నతోకట్ట, సంజీవయ్యనగర్ కంసారిబజార్, దర్జీ ఆరోవార్డులో సీతారాంపురంలో బస్తీవాసుల ఆహ్వానం మేరకు ఆదివారం పర్యటించి బస్తీవాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధితుల పక్షనా బీజేపీ పోరాడుతుందన్నారు. బస్తీవాసులు అశోక్, యాదవ్‌రావు మాట్లాడుతూ.. గతంలో బస్తీబాట నిర్వహించిన సమయంలో రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లిన సమస్యలు చాలావరకు పరిష్కారమయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ ఒకటో వార్డు అధ్యక్షుడు జైపాల్ రాకేశ్, ఆరో వార్డు అధ్యక్షుడు ప్రతీక్ జైన్, పూర్వ అధ్యక్షులు బట్టు శంకర్, రాయల్‌కుమార్, సంతోష్ తీరత్‌కుమార్, సిద్ధు, రాజ్‌కుమార్, శ్రవణ్ దమయంతి, సునీత, శ్రీరాములు యాదవ్, అజయ్‌గౌడ్, స్వరూప, అరవింద్, అశోక్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**తాగునీటి పైపులైను పనులు ప్రారంభం..**

రెండో వార్డు అన్నానగర్‌లో బోర్డు నిధులతో చేపట్టే తాగునీటి పైపులైన్ పనులను బోర్డు నామినేటెడ్ సభ్యుడు జే. రామకృష్ణ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు శ్రవణ్, అశోక్, హర్షవర్ధన్, రమేశ్, మమత, రేఖాకిశోర్, మహేశ్ పాల్గొన్నారు.

## 'వేయిగొంతుకలు..లక్షడప్పుల'కు తరలిరావాలి



కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కళాకారులు

**బన్సీలాల్‌పేట్:** ఫిబ్రవరి 7న నగరంలో నిర్వహించనున్న 'వేయిగొంతుకలు.. లక్షడప్పుల' కార్యక్రమానికి మాదిగలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని గొల్ల కొమురయ్య కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం సాయంత్రం సనత్‌నగర్ మాదిగల హక్కుల అభివృద్ధి పార్టీల సంఘాల ఐక్యత జేఏసీ ఆధ్వర్యంలో సన్నాహక కార్యక్రమం జరిగింది. కాలనీ నాయకులు కేఎం కృష్ణ, ఈ. నర్సింగ్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కళా మండలి అధ్యక్షులు ఎస్‌వై అశోక్, ఎన్. చందర్, రాగటి సత్యం, కుర్మ లక్ష్మీపతి, పుల్లూరి మహేందర్, ఏసూరి మహేశ్, డాక్టర్ శివకుమార్ లాల్, డీ. సుదర్శన్‌బాబు, ఎస్. రాజు, ఎస్.ఆర్ మల్లేశ్ తదితరులు మాట్లాడారు. ఉమ్మడి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణతోనే దళితుల్లోని అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం మాదిగలు, మాదిగ ఉపకులాలకు విద్య, ఉద్యోగ, రాజకీయపరంగా న్యాయం జరుగుతుందని భావించిన తరుణంలో మాల నాయకులు అడ్డుపడుతుండడం తగదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మాచర్ల ప్రభాకర్, కే కుమార్, శంకర్, గోపన్నతో పాటు రాపాక అశోక్, దేవేందర్, న్యాయవాది మల్లికార్జున్, బొడ్డు మహేశ్, ఎస్.వై. గిరి, కుర్మ మహేందర్, శ్రీకాంత్, మహేశ్, హరి పాల్గొన్నారు.

**జయప్రదం చేయాలి..**

**అడ్డగుట్ట:** ఫిబ్రవరి 7న తలపెట్టిన వేయిగొంతులు.. లక్ష డప్పుల' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బహుజన యుద్ధ నౌక ఏపూరి సోమన్న పిలుపునిచ్చారు. దీన్ని పురస్కరించుకుని చేపట్టిన హైదరాబాద్ జిల్లా రథయాత్ర ఆదివారం అడ్డగుట్టకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు డప్పులతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో శ్రావణ్, మల్లికార్జున్, అశోక్ మాదిగ, భిక్షపతి, వేణుగోపాల్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌వై అశోక్, కేఎం కృష్ణ

## స్మారక పురస్కారం ప్రదానం



పురస్కారం అందుకుంటున్న జేఎస్‌టీ శాయి

**సనత్‌నగర్:** సనత్‌నగర్ మోడల్‌కాలనీ ఉపాధ్యక్షుడు, సామాజిక కార్యకర్త జేఎస్‌టీ శాయికి ప్రముఖ పాత్రికేయుడు పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు స్మారక పురస్కారం లభించింది. తెలుగు కళావాహిని, శ్రీకళాభారతి, కృష్ణ కళాభారతి, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితిల ఆధ్వర్యంలో విజయవాడలోని కౌతు పూర్ణానంద కళావేదికలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మాట్లాడుతూ.. జర్నలిజం విలువలకు పెద్దపీట వేసిన కొంత మంది వ్యక్తుల్లో ఆయన ముందువరుసలో ఉంటారన్నారు. ఈ పురస్కారం తనను మరింత ఉత్సాహంగా ముందుకునడిపించేందుకు ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. అవార్డుకు తనను ఎంపిక చేసిన నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఖైరతాబాద్:** నిమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్, ట్రీ కటింగ్‌లో భాగంగా సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎర్రమంజిల్ ఏరియా, రోడ్ నెం.1, బాలాపురా బస్తీ ఏరియా, ఎర్రమంజిల్ చమాన్ పీటీ ఏరియా, పంచాయతీరాజ్ ఆఫీస్, శ్రీకావేరి సాంబశివరావు రెసిడెన్సి, పోస్టాఫీస్ ఏరియా లేన్, జీవీకె మాల్ వెనుక వైపు ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

## సమస్యల పరిష్కారానికే ప్రథమ ప్రాధాన్యం



డీఎస్‌ఎంకాలనీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

**సనత్‌నగర్:** అధికారంలో ఉన్నా.. లేకున్నా.. నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్‌లోని డీఎస్‌ఎం కాలనీలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలోని రోడ్లపై తెల్లవారుజామున 2, 3 గంటల వరకు ఆకతాయిలు తిష్ఠ వేస్తున్నారని, దీంతో బయటకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన స్పందిస్తూ రాత్రి వేళల్లో తప్పనిసరిగా పెట్రోలింగ్ నిర్వహించాలని సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులును ఆదేశించారు. అలాగే ప్రమాదకరంగా ఉన్న హైటెన్షన్ లైన్ తొలగించాలని, వేలాడుతున్న వైర్లను తొలగించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని, మసీదు వరకు రోడ్డు నిర్మించాలని కోరగా, ప్రతిపాదనలు తయారు చేయాలని జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లను ఆదేశించారు. ఫతేనగర్ ఫ్లైఓవర్ విస్తరణ, సనత్‌నగర్ ఇండస్ట్రీయల్ ప్రాంతం నుంచి బాలానగర్ వరకు అండర్‌పాస్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి శంకుస్థాపన కూడా చేశామని, అయినా ఇప్పటివరకు ఆ పనులకు సంబంధించి నిధులు విడుదల చేయలేదన్నారు. త్వరలోనే విద్యుత్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తామని చెప్పారు. ఆయన వెంట కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, వాటర్‌వర్క్స్ జీఎం హరిశంకర్, జీహెచ్‌ఎంసీ డీఈ వాసుదేవరెడ్డి, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సయ్యద్, ఎలక్ట్రికల్ ఏఈ శేఖర్, స్ట్రీట్‌లైట్ ఏఈ నారాయణ, ఏఎంఓహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ఖలీల్‌బేగ్, సురేశ్‌గౌడ్, రాజేశ్‌ముదిరాజ్, శేఖర్, ఫాజిల్, కరీముల్లా, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

## మర్యాదపూర్వక కలయిక



కేంద్ర మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అడ్డగుట్ట డివిజన్ బీజేపీ అధ్యక్షురాలు సౌందర్య

**అడ్డగుట్ట:** అడ్డగుట్ట డివిజన్ బీజేపీ అధ్యక్షురాలుగా ఇటీవల గాజుల సౌందర్య నియామకమైంది. దీంతో ఆదివారం సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. డివిజన్ అధ్యక్షులుగా అవకాశం కల్పించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు హంసరాజ్, వీరేశం, శ్రావణ్, మోహన్, ఉదయ్, ప్రసాద్, లక్ష్మి, రాములమ్మ, గీత, కల్యాణి, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

## కుంగ్ ఫూ కరాటే పోటీలు



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఎస్. కుమార్

**లాలాపేట:** న్యూ షావోలిన్ కుంగ్ ఫూ ఇంటర్నేషనల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో తార్నాకలోని మర్రి కృష్ణా హాల్‌లో ఆదివారం రెండో నేషనల్ ఓపెన్ కుంగ్ ఫూ అండ్ కరాటే చాంపియన్‌షిప్–2025 పోటీలు నిర్వహించారు. జాతీయ స్థాయి నుంచి వివిధ కేటగిరీల్లో దాదాపు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కుంగ్ ఫూ, కరాటే, తైక్వాండో, ఎంఎంఏ, సిలామ్‌బాంమ్, కాటా ఫోమ్, కుమిటీ, వెపన్ ఫోమ్, టీమ్ ఫోమ్ తదితర విభాగాల్లో క్రీడాకారులు నైపుణ్యాలు ప్రదర్శించారు. అనంతరం విజేతలకు టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్, గ్రాండ్ మాస్టర్ ఎస్. కుమార్ ట్రోఫీలు, సర్టిఫికెట్లు, బెల్టులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ వెంకట స్వామి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## మహిళలకు సన్మానం



**ఉస్మానియా యూనివర్సిటీ:** వివిధ రంగాల్లో సేవలందించిన మహిళలను మెమొంటో, శాలువాలతో ఆదివారం ఘనంగా సన్మానించారు. శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో బిర్లా ప్లానిటోరియంలో జరిగిన కార్యక్రమానికి సినీనటి కవిత, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య తదితరులు హాజరై 116 మందికి సౌతిండియా ఉమెన్ ఇన్‌స్పైరేషన్ అవార్డు–2025 అందచేసినట్లు డైరెక్టర్ డాక్టర్ కమల మనోహర్ తెలిపారు.



## ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కృష్ణమూర్తి

**లాలాపేట:** ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి బెజ్జాల కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. పలువురి ఆటో డ్రైవర్లతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించి డ్రైవర్ల స్థితిగతులు, సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో ఆటో డ్రైవర్లకు సరైన ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి అనేక హామీలిచ్చి అమలు చేయలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇచ్చిన హామీల మేరకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆటో డ్రైవర్‌కు ఏడాదికి రూ 12 వేలు చెల్లించాలని కోరారు. లేకుంటే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆటో యూనియన్ నాయకులు హుస్సేన్, రాజు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## కరాటేలో విద్యార్థుల సత్తా

**సనత్‌నగర్:** బేగంపేట ఓల్డ్ పాటిగడ్డ గ్రౌండ్‌లో విద్యార్థులకు కరాటేలో బెల్ట్ పరీక్షలను ఆదివారం నిర్వహించారు. గ్రాండ్ మాస్టర్ కంలేశ్వర్, డిప్యూటీ గ్రాండ్ మాస్టర్ కల్యాణ్, చీఫ్ ఎగ్జామినర్ శ్రీను, వెంకట్, అమీర్ మాస్టర్ల సమక్షంలో పరీక్షలు జరపగా పాటిగడ్డ జీహెచ్‌ఎంసీ శిక్షణ కేంద్రం విద్యార్థులు వివిధ రకాల బెల్ట్స్‌లో ప్రతిభ చూపి అవార్డులతో పాటు సర్టిఫికెట్లు పొందారు. ఈ సందర్భంగా విద్యార్థులను కోచ్ చందుముదిరాజ్ అభినందించారు.



## వృద్ధుడి అదృశ్యం

**ఖైరతాబాద్:** వృద్ధుడు కనిపించకుండాపోయిన ఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్‌ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం ..ఆనంద్‌నగర్‌లో నివాసముండే నేహా రత్తి బ్యూటీ పార్లర్‌గా పనిచేస్తుంది. మూడు నెలల క్రితం ఢిల్లీ నుంచి వచ్చిన ఆమె తండ్రి రాంకుమార్ (67) ఆమె వద్దే ఉంటున్నాడు. శనివారం ఉదయం 10 ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాంకుమార్ తిరిగి రాలేదు. ఆచూకీ కోసం తెలిసిన వారి వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.